జంతర్ మంతర్‌లో ఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాంగ్రెస్ నేతల పాదయాత్ర.

•ఢిల్లీలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్.



ఢిల్లీ / అక్టోబర్ 12 / అక్షరం న్యూస్ –:

ఢిల్లీ లో ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, జాటోతు రామచంద్ర నాయక్, కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమ్మిండ్ల శ్రీనివాస్‌తో పాటు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారూ.ఈ సందర్భంగా నాయకులు ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తు నినదించారు.

ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

•ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి.

•ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వొద్దు.

•జిల్లా జాయింట్ కలెక్టర్ డి.వేణుగోపాల్.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం/ అక్టోబర్ 12 / అక్షరం న్యూస్ –:

వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి వేణుగోపాల్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మావతి, ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, హౌసింగ్ పిడి సవేరామ్ తో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు.తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి, స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు

అశ్వాపురం మండలం నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి నిధులు దుర్వినియోగం చేసినందుకు అతనిని తొలగించి చట్టపరమైన క్రిమినల్ కేసులు పెట్టుట కొరకు, గుండాల మండలం కొడవ దంచ గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను నివారించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయుట కొరకు, మణుగూరు మండలం అజయ్ నగర్ గ్రామానికి చెందిన చిట్టిమల్ల శిరీష అంగన్వాడి టీచర్ ఉద్యోగానికి రెసిడెన్షియల్ సర్టిఫికెట్ సమర్పించనందున విచారణ జరిపి న్యాయం చేయుట గురించి, మణుగూరు మండలం రామానుజవరం గ్రామపంచాయతీ మల్లేపల్లి గ్రామానికి చెందిన తడికల ఆకాంక్ష అంగనవాడి టీచర్ ఉద్యోగానికి మెరిట్ ఉన్న ఇంటర్వ్యూలో సెలెక్ట్ చేయలేదని తగిన న్యాయం చేయుట కొరకు దరఖాస్తుల సమర్పించారని ఆయన అన్నారు.

సంబంధిత అధికారులు ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం



• కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.

భద్రాద్రి కొత్తగూడెం / చుంచుపల్లి / అక్టోబర్ 12 / అక్షరం న్యూస్–

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సోమవారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, నేరాల గుర్తింపు, దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు, పోలీస్ స్టేషన్లలోని కెమెరాలను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ప్రస్తుతం మొత్తం 467 సీసీటీవీ కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానం చేయడంతో జిల్లాలో నిఘా వ్యవస్థ మరింత బలోపేతమైంది.ఈ వ్యవస్థ ద్వారా ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించడం సులభతరం కానుంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నేరాల నియంత్రణలో సీసీటీవీ నిఘా వ్యవస్థ కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

•అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 31 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణ -- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 12 / అక్షరం న్యూస్–:

దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు.

ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించడంతో పాటు, ప్రజలకు పోలీసు శాఖ సేవలు, బాధ్యతలు, త్యాగాలపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, పోలీస్ అమరవీరుల కుటుంబాల పరామర్శ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పోలీసుల విధులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజల భద్రతలో పోలీసుల పాత్రను ప్రజలకు వివరించనున్నారు. అలాగే పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాల్లో అమరవీరుల త్యాగాలను వివరిస్తూ పాటల కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ప్రధాన కూడళ్లలో అమరవీరుల సంస్మరణ బ్యానర్లను ఏర్పాటు చేయనున్నారు. వ్యాసరచన పోటీలు..(తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో).కేటగిరి – 1ఇంటర్మీడియట్ వరకు విద్యార్థిని విద్యార్థుల కోసం.



1. సైబర్ నేరాల నివారణలో పోలీసుల – పౌరుల పాత్ర.2. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర....విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు.

కేటగిరి –2 డిగ్రీ మరియు ఆపై చదువుతున్న విద్యార్థుల కోసం.1. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర.

2. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర.

పోలీస్ అధికారులకు..

కేటగిరి –1 కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు..

1. ప్రజాస్వామ్య వ్యవవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు.

2. పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర – సోషల్ మీడియా కు బానిస కాకుండా ఉండటం మరియు వ్యక్తిగత మరియు సామాజిక ప్రయోజనాల కోసం దానిని సద్వినియోగం చేసుకోవటం ఎలా.

కేటగిరి – 2 ఎస్.ఐ మరియు పై స్థాయి అధికారులు..

1. పౌరుల మన్ననలు పొందటానికి పోలీసులు చేయవలసిన కృషి.

2. నెలస్థాయి పోలీసు వ్యవస్థ బలోపేతం చేయడం ఎలా.ఈ వ్యాసరచన పోటీలను తెలుగు ఇంగ్లీష్ ఉర్దూ భాషలలో నిర్వహించాలని, 500 పదాలకు మించకుండా వ్యాసరచనలో పాల్గొని, ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుందని తెలియజేశారు.

షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు: జిల్లాలోని విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. పోలీసుల సేవలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాల నిర్మూలన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవలు తదితర అంశాలపై ఫోటోలు, వీడియోలను రూపొందించవచ్చు. షార్ట్ ఫిలిమ్స్ మూడు నిమిషాలకు మించకుండా ఉండాలి. ఉత్తమంగా నిలిచిన ఎంట్రీలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ ఫోటోలు, వీడియోలను అక్టోబర్ 24వ తేదీలోపు చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పైన ఉన్న ఐటీ కోర్ విభాగంలోని ఐటీ కోర్ సీఐ రాముకు అందజేయాలని ఎస్పీ సూచించారు.విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని, దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం వారు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఈ సందర్భంగా తెలిపారు.


భద్రాచలం రోడ్ పేరు మార్చాలి

• కొత్తగూడెం రైల్వే స్టేషన్‌గా నామకరణం చేయాలి.

• ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా స్టేషన్ పేరు ఉండాలి.

•కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 12 / అక్షరం న్యూస్ –: : భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పేరును తక్షణమే 'కొత్తగూడెం రైల్వే స్టేషన్'గా మార్చాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌లకు కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఇద్దరు రైల్వే ఉన్నతాధికారులకు సోమవారం లేఖలు పంపించారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్ పూర్తిగా కొత్తగూడెం పట్టణం నడిబొడ్డున ఉన్నప్పటికీ, భద్రాచలం రోడ్ పేరుతో పిలవడం వల్ల ప్రయాణికుల్లో తీవ్ర గందరగోళం నెలకొంటోందని పేర్కొన్నారు. భద్రాచలం పట్టణం ఈ స్టేషన్‌కు చాలా దూరంలో ఉందని, కొత్తగూడెం మాత్రమే ఈ రైల్వే సేవల ద్వారా నేరుగా అనుసంధానమై ఉందని ఆయన వివరించారు. ప్రస్తుత పేరు ఇక్కడి భౌగోళిక వాస్తవికతకు ఏమాత్రం సరిపోవడం లేదని స్పష్టం చేశారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని, ప్రజా ఆకాంక్షలను ప్రతిబింబించేలా స్టేషన్ పేరును కొత్తగూడెంగా మార్చాల్సిన బాధ్యత రైల్వే శాఖపై ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల సౌకర్యార్థం ఈ ప్రతిపాదనను పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని కూనంనేని డిమాండ్ చేశారు.



ఆహ్లాదంతోనే మానసిక ప్రశాంతత

- నిరంతర ఒత్తిళ్ల నుంచి కాస్త విరామం..ఆహ్లాదం.
- 45 రోజుల పాటు ఎగ్జిబిషన్ ప్రదర్శన.
- ప్రజలు, చిన్నారులకోసమే వినోద వేదికల ఏర్పాటు.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.
- లక్ష్మీదేవిపల్లిలో బాబా ట్రేడ్ ఫేర్స్ ఎగ్జిబిషన్'ను ప్రారంభించిన సాబీర్ పాషా.



భద్రాద్రి కొత్తగూడెం / లక్ష్మీదేవిపల్లి / అక్టోబర్ 12 / అక్షరం న్యూస్ –: : రోజువారీ యాంత్రిక జీవనం, నిరంతర పని ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు ఆహ్లాదకరమైన వినోద వేదికలు ఎంతో అవసరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. దసరా, దీపావళి తదితర పండుగల సీజన్ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో బాబా ట్రేడ్ ఫేర్స్ పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎగ్జిబిషన్'ను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపేందుకు, చిన్నారులకు చక్కని ఆటవిడుపును అందించేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రజలు ఒకే చోట వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేయడంతో పాటు మంచి వినోదాన్ని పొందేందుకు ఇది చక్కటి అవకాశమని పేర్కొన్నారు. మొత్తం 45 రోజుల పాటు కొనసాగే ఈ ప్రదర్శనను ప్రజలు, చిన్నారులు వినియోగించుకుని మానసిక ఉల్లాసాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోర్స వీరబాబు, పడిగ రాంబాబు, కళ్యాణి, లక్ష్మినర్సు, కనకరాజు, ఎస్సై అఖిల, ఎగ్జిబిషన్ నిర్వాహకులు షఫి, రమణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా పట్టణంలోని బండారికుంట రోడ్డు

- -భారీ వాహనాల రాకపోకలను అడ్డుకోవాలని ప్రజావాణిలో మొర




పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 12 అక్షరం న్యూస్

పట్టణంలోని 19వ వార్డు పరిధిలోని బండారికుంట ప్రధాన రహదారి గుండా మితిమీరిన బరువుతో వెళ్తున్న భారీ వాహనాల రాకపోకలను వెంటనే నిలిపివేసి,రోడ్డును పునర్నిర్మించాలని కోరుతూ స్థానిక కాలనీవాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ బండారికుంట మార్గానికి ఎలాంటి బైపాస్ రోడ్డు హోదా లేకపోయినప్పటికీ, దళితులు, మైనార్టీలు నివసించే ఇండ్ల మీదుగా భారీ టిప్పర్లు, లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రహదారి పూర్తిగా ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు.భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు కింద ఉన్న తాగునీటి సరఫరా పైపులు పగిలి నీరంతా రోడ్లపై కాలువలా ప్రవహిస్తోందని, వాహనాల ప్రకంపనలకు ఇండ్ల గోడలు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని వాపోయారు. అలాగే విపరీతమైన దుమ్ముధూళి కారణంగా ఇప్పటికే ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్ర అనారోగ్యం పాలయ్యారని,సమీపంలోని ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరి నడుమ రోడ్లపైకి వచ్చి వాహనాలను అడ్డుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రం సమర్పించిన వారిలో బొంకూరి నవీన్, సుద్దాల శ్రీకాంత్, కనకం సాయి, సుద్దాల శ్రీధర్, నల్లాల తేజ, బొంకూరి అజయ్,ముల్కల వేణుతో పాటు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 19వ వార్డు బాధ్యులు మహమ్మద్ షఫీ, గౌస్, నవాబ్,రియాజ్, బొంకూరి భూలక్ష్మి, మొలకల హారిక, కుక్క మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

పూల సంబురం ఆటాపాటల వైభవం

- -పెద్దపల్లిలో ఘనంగా తెలంగాణ జాగృతి బతుకమ్మ వేడుకలు



పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 12 అక్షరం న్యూస్

తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన పూల పండుగ బతుకమ్మ సంబరాలు పెద్దపల్లిలో కన్నులపండువగా సాగాయి.తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు మేడారపు రాజ్యలక్ష్మి నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.ఈ సంబరాలకు తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు మరిపెల్లి మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను మధ్యలో ఉంచి,మహిళలంతా వలయాకారంగా తిరుగుతూ లయబద్ధమైన చప్పట్లతో జానపద పాటలు ఆలపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ఐదు బతుకమ్మలను ఎంపిక చేసి,వాటిని రూపొందించిన మహిళలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకరి రజిత,నాయకురాళ్లు సలేంద్ర మమతారాణి,శారద,రోజారమణి, ముస్త్యాల స్వప్న,శ్రీలత,అర్నకొండ సరిత,అర్నకొండ పద్మ,కీర్తి ఉమ, రాజం జ్యోతి,దాసరి అంజలి,ఎండీ గౌస్య బేగం సహా పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ అంకిత్





- దమ్మపేట మండల ప్రజావాణిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి.
- మండలంలోని 230 చెరువుల నీటి నిల్వలపై ఆరా.
- ప్రజావాణిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి...జిల్లా కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం / దమ్మపేట / అక్టోబర్ 12/అక్షరం న్యూస్ –:

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ప్రజావాణికి హాజరైన వివిధ శాఖల అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు.అనంతరం మండలంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం తో తాగునీటి సరఫరా, చెరువుల నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులను తాగునీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇరిగేషన్ అధికారుల ద్వారా మండలంలోని 230 చెరువుల నీటి నిల్వల వివరాలను తెలుసుకున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నీటి నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులను రైతు వేదికల్లో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాలకు హాజరవుతున్న రైతుల సంఖ్య, వారికి అందిస్తున్న సలహాలపై ఆరా తీశారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు.అటవీశాఖ అధికారులను ఫారెస్ట్--రెవెన్యూ సంయుక్త సర్వేలు, భూ రీసర్వే పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంయుక్త సర్వేలను నిర్దేశిత విధానాల ప్రకారం చేపట్టాలని, సర్వేలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మండల ప్రజావాణికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరవుతున్న అంశంపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి వారం ఎంతమంది దరఖాస్తుదారులు వస్తున్నారు, మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి ఎందుకు వస్తున్నారు అనే వివరాలను ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు.మండల ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, యువత సహకారంతో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను మండల స్థాయిలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని, ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు . ఈ పరిశీలనలో దమ్మపేట తాసిల్దార్ మురళి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు: మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



హనుమకొండ / ధర్మసాగర్ / అక్టోబర్ 12 / అక్షరం న్యూస్

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన బీఆర్ఎస్‌కే ఆ హక్కు ఉందని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు అంశంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై, దేవాదుల ఎత్తిపోతల పథకం పనులపై తీవ్ర విమర్శలు చేశారు.

దేవాదుల పనుల్లో నిర్లక్ష్యం ఎందుకు

దేవాదుల ఎత్తిపోతల పథకంలోని లిఫ్టుల నిర్మాణ పనులను పూర్తి చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రాజయ్య ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 104 కోట్లతో మూడు లిఫ్టులకు శంకుస్థాపన చేసినప్పటికీ, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక్క లిఫ్టు కూడా పూర్తిచేయ లేదని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందని, పనుల పురోగతిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కమీషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై రాజయ్య ఆరోపణలు చేశారు. కమీషన్ల సొమ్మును దాచుకునేందుకే విదేశీ పర్యటనలకు వెళ్తున్నారంటూ విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కూడా తాటికొండ రాజయ్య విమర్శలు చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు సాగునీరు, విద్యుత్ అందించే విషయంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఓటరు నమోదుపై సమీక్ష

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రాధాన్యాన్ని వివరిస్తూ, అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ప్రభుత్వ పనితీరును పరిశీలించి ఓటు వేయాలని రాజయ్య పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మండల నాయకులు కర్ర సోమిరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, లక్క శ్రీనివాస్, గుర్రపు ప్రవీణ్, గంటె బాలకుమార్, కొలను రాజు, కుమారస్వామి, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ జట్టు



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానంపై తమ ప్రతిభను చాటుతూ ఎన్టీపీసీ రామగుండం--తెలంగాణకు చెందిన 'టీమ్ పర్యావరణ' జట్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన ఎన్టీపీసీ జాతీయ స్థాయి కార్యాచరణ, సాంకేతిక పరిజ్ఞాన పోటీ 2026 (నోసెట్) ప్రాంతీయ స్థాయి పోటీల్లో ఈ జట్టు విజేతగా నిలిచింది. దీంతో దక్షిణ ప్రాంతం తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది.

ఈ ప్రాంతీయ స్థాయి పోటీల్లో వల్లూరు, సింహాద్రి, కుడ్గి, రామగుండం--తెలంగాణ విద్యుత్ కేంద్రాలతో పాటు దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయం జట్లు పాల్గొన్నాయి. మొత్తం ఐదు విద్యుత్ కేంద్రాలు, ప్రాంతీయ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన జట్లు తమ పరిజ్ఞానం, నైపుణ్యాన్ని ప్రదర్శించాయి.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609